క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

సాక్షి, భీమవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజలకు ఉపయోగపడని బడ్జెట్ అని అన్నారు. వ్యవసాయానికి రైతులకు ఇచ్చే సబ్సిడీల్లో గతంతో పోలిస్తే రూ.50 వేల కోట్లు కోత విధించారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ నిధులు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ రైల్వేజోన్ ఊసేలేదన్నారు.. కేంద్రం ప్రవేశ పెట్టే ప్రతి బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందని బలరాం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్వీ గోపాలన్, డి.కల్యాణి, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలకు ఉచిత శిక్షణ

సాక్షి, భీమవరం: స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్-1,2,4, పోలీసు కానిస్టేబుల్, ఎస్సై పోటీ పరీక్షల శిక్షణ కోసం ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేజే ప్రసూన శుక్రవారం విలేకరులకు చెప్పారు. ఈ నెల 6 నుంచి కోచింగ్ క్లాసులు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తామని ఆసక్తి ఉన్న అభ్యర్థులు కోచింగ్ సెంటర్ కో-కన్వీనర్ పి అమూల్యారావు, సెల్ నెంబర్ 84648 72037కు ఫోన్ చేయాలని సూచించారు.

వరదరాజ స్వామి ఆలయంలో భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు

ఆకివీడు: మాఘ మాసం సందర్భంగా వైష్ణవాలయాల్లో భగవద్గీత పారాయణం చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆదేశాల మేరకు పలువురు మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వరద రాజస్వామి ఆలయంలో 50 మంది మహిళలు శుక్రవారం పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ రామిశెట్టి సూరిబాబు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన వరద రాజస్వామి ఆలయం దేశంలోనే అరుదైన దేవాలయంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో గీతా మహిళా మండలి అధ్యక్షురాలు రాజ్యలక్ష్మీ(అక్కయ్య), శివకేశవ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకోడేరు: 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం పెన్నాడ, శృంగవృక్షం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమవరంలో..

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువులో విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించే నిమ్మిత్తం శనివారం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. తుందుర్రు, దూసనపూడి, బాలేపల్లి, కమతాలపల్లి, మత్స్యపురిపాలెం గ్రామాలతో పాటు తుందుర్రులోని గోదావరి మెగా ఆక్వా ఫుడ్‌పార్కుకు ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రీ సర్వే పనులు వేగవంతం చేయాలి



పెదఅమిరంలో భూరీసర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణారావు

కాళ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలని కాళ్ల తహసీల్దార్ టీపీ కృష్ణారావు అన్నారు. పెద అమీరంలో గ్రామంలో చేపట్టిన రీసర్వే పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. భూ రీసర్వే వల్ల ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు భూ వివాదాలు త్వరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈయన వెంట ఆర్ఐ రాఘవమూర్తిరాజు, వీఆర్వో కుమార్, సర్వేయర్లు నరేష్, భార్గవ్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

పాలకోడేరు: 'జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించే బృహత్తర బాధ్యత మీ పైనే ఉందని, రాబోయే రోజుల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి' అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఉద్బోధించారు. శుక్రవారం నాడు మండలం లోని పాలకోడేరు, శృంగవృక్షం గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామ వలంటీర్లు, గృహ సారథుల సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజానికి సంక్షేమ పథకాలు అన్నీ మీ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందడం వల్ల మీకు మంచి పేరు వచ్చిందన్నారు. మీకు తోడుగా గృహ సారథులను ఏర్పాటు చేశామని, రాబోయే రోజులు కీలకమని, అందువల్ల పథకాలు గురించి వివరిస్తూ జగనన్న అమలు చేస్తున్నారని చెప్పాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే మీరు వృద్ధులకు, వారి వికలాంగులకు పింఛన్ సొమ్ము వారు ఇళ్ల వద్దనే చేతికి ఇస్తుంటే వారి కళ్లల్లో ఆనందం మనకెంతో తృప్తినిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 87 శాతం మందికి పథకాలు అందించడం గొప్ప విషయమన్నారు. జగనన్న పథకాల గురించి వివరిస్తూ మీ కుటుంబానికి ఇంతవరకు అందిన లబ్ధి ఇంత అని మేము గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో తిరిగి చెప్పినప్పుడు ఆశ్చర్యపోతున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, జగనన్న విద్యా దీవెన, నాడు-నేడు లో పాఠశాలల ఆధునికీకరణ, ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ లాంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో బలంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ మూడున్నరేళ్లు ఒక ఎత్తు, రాబోయే ఏడాదిన్నర ఒక ఎత్తు అని పీవీఎల్ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షుడు భూపతిరాజు చంటి రాజు, వైస్ ఎంపీపీలు శోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మీ తులసి, కో ఆప్షన్ సభ్యురాలు డాక్టర్ డి.ఆర్ స్వర్ణలత, జేసీఎస్ మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, పెన్మెత్స శ్రీనివాసరాజు, భూపతి రాజు వంశీ కృష్ణంరాజు, దెందుకూరి వెంకట్రాజు, దుండి అశోక్ బాబు, సర్పంచ్‌లు జంగం సూరి బాబు, ఇంజేటి మరియమ్మ, బోల్లా శ్రీను, గొట్టుముక్కల శివాజి రాజు, చిల్లా అనూష పాల్గొన్నారు.

గొర్రెలకు టీకాలు



గొర్రెలకు టీకాలు వేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం డివిజన్‌లోని 10 మండలాల పరిధిలో ఉన్న 30,867 గొర్రెలు, 17996 మేకలకు పీపీఆర్ టీకాలు వేస్తున్నట్లు పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ జాహీర్ హుస్సేన్ తెలిపారు. టీకా కార్యక్రమం ఈ నెలాఖరు వరకూ నిర్వహిస్తామని తెలిపారు. పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం సుమారు 4100 గొర్రెలకు, 1039 మేకలకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, డాక్టర్ పుండరీ బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: భీమవరం టూటౌన్‌లో రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ కు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో రెండో పట్టణ సీఐ కృష్ణకుమార్, ఎస్సై అప్పారావులతో ట్రాఫిక్ సమస్యపై సమీక్ష జరిపారు. అనంతరం మాట్లాడుతూ టూటౌన్‌లో తాడేపల్లిగూడెం రోడ్లో నిర్మించిన భారీ అండర్ టన్నెల్ వల్ల చాలా వరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారమైందని తెలిపారు. అయితే భీమవరం జిల్లా కేంద్రం కావడంతో జిల్లా నలుమూలలనుంచి ప్రజలు, రోజువారి వ్యాపారస్తులు పెద్దఎత్తున భీమవరం వస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా, వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండా ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో కాలేజీల నుంచి బస్సులు రెండో పట్టణం మీదుగా వన్ టౌన్ కు చేరుకుని అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు విద్యార్థులను తీసుకొని వెళ్తున్న నేపథ్యంలో ముఖ్యంగా ఆ సమయాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

మాలమహానాడు పట్టణ కార్యదర్శిగా చందుబాబు



చందుబాబుకు నియామక పత్రం అందజేస్తున్న పుష్పరాజ్

సాక్షి, భీమవరం: అంబేడ్కర్ ఆశయాలు కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్ప రాజ్ కోరారు. భీమవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో. భీమవరం పట్టణ కార్యదర్శిగా పెనుమల్ల చందు బాబును శుక్రవారం నియమించారు. నియామక పత్రం అందజేసి ఆయన పుష్పరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అంబేద్కర్ ఆశయాలు అనుగుణంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో అంబేడ్కర్ భవనం ఏర్పాటు చేసి వాటిలో పుస్తకాలు పెట్టి వాటి నిర్వహణ ప్రభుత్వం నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా కార్యదర్శులు చిల్లి రాజ్ కుమార్, కోలాటి ప్రసాదరావు, పిట్టా వినోద్ కుమార్, గొర్ల గోపి, చిగురుపాటి రాజేష్, నన్నేటి నాగరాజు, నేతల సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు



భీమవరం భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందచేయడానికి చర్యలు తీసుకున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి శ్యామ్‌సుందర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం భీమవరం పట్టణంలోని గాలిరామయ్య మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన నిర్ధారణ పరీక్షల కోసం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ భీమవరం పట్టణం, వీరవాసరం, కాళ్ల, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, భీమవరం రూరల్ మండలాలకు చెందిన దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ ఎంఎస్ శ్రీమన్నారాయణ, సీఎంఓ ఎ.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమృద్ధిగా నీరు అందించాలి



మాట్లాడుతున్న రైతు కార్యాచరణ సమితి నాయకులు

సాక్షి, భీమవరం: జిల్లాలోని కాలువ శివారు భూములకు సైతం సమృద్ధిగా సాగునీరు అందించడానికి వంతుల వారీ విధానం పటిష్టంగా అమలు చేయాలని రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు గోపాలకృష్ణంరాజు, పాతపాటి మురళీరాజు కోరారు. శుక్రవారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సాగునీటి ఎద్దడి లేకుండా జలవనరుల శాఖ చేపట్టిన వంతుల వారీ విధానంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతుల సలహా మండలి సమావేశాలకు రాజకీయాలకు అతీతంగా రైతు సంఘాల ప్రతినిధులను కూడా ఆహ్వానించాలని, దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు వారు తెలిపారు. భూముల రీసర్వే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు నల్లం నాగేశ్వరరావు, సీతారామరాజు, తమ్మినీడి నాగేశ్వరరావు, గంటా సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: నాయి బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయం మరువలేనిదని నవుదూరు శ్రీపద్దాల వెంకమ్మ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు టి.త్రిమూర్తులు తెలిపారు. నాయి బ్రాహ్మణులకు రూ.10 వేలు సాయం చేసిన సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయిబ్రాహ్మణులంతా వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా నిలిస్తామని అన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం ఉపాధ్యక్షుడు తాతపూడి శివగణేష్, పట్నాల గణపతి పాల్గొన్నారు.

13 నుంచి సువార్త సభలు

ఉండి: మండలంలోని ఆరేడులో ఈ నెల 13 నుంచి 15 వరకూ ఎష్కోలు యేసయ్య దీవెన ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో యేసుక్రీస్తు రక్షణ సువార్త సభలను నిర్వహిస్తున్నట్లు పాస్టర్ కే డేవిడ్‌రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సభలకు వాక్యోపదేశకులుగా పాస్టర్ ఎం.ప్రభుదాస్ (ఏలూరు), సిస్టర్ టి.మరియమ్మ (పాములపర్రు), బ్రదర్ విశ్వాస్‌పాల్(రాజమండ్రి) నుంచి విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభలకు విశ్వాసులంతా తప్పక రావాలని ఆహ్వానిస్తున్నట్లు పాస్టర్ తెలిపారు.

పేకాడుతున్న 8 మంది అరెస్ట్

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం లోసరి గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 8 వేల 670 నగదును స్వాధీనం చేసుకుని వారిపై హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ఆకివీడు: స్థానిక సమతానగర్ రోడ్డులో నివసిస్తున్న 23 ఏళ్ల యువతి ఈ నెల 2న ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. ఉన్నత చదువు చదివి ఇంట్లోనే ఉంటున్న ఆమెకు పెళ్లి చేయడానికి పెద్దలు నిర్ణయించడంతో ఇప్పుడే పెళ్లి వద్దని ఇంటిలో నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

వీరవాసరం: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. వీరవాసరం పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి మోటార్ సైకిల్ ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా పోలీసులకు సహకరించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు సహకరించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణం చేయాలని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై పి.రమేష్ ఉన్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుడితో సెబ్ అధికారులు

సాక్షి, భీమవరం: పట్టణంలోని 36వ వార్డు శివరావు పేటలోని ఒక ఇంట్లో 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ వర్మ తెలిపారు. సెబ్ అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్‌కు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు పోలిశెట్టి రాము ఇంటిపై దాడి చేసి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, రామును అరెస్ట్ చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఈ దాడుల్లో సెబ్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, వర్మ, హెడ్ కానిస్టేబుల్ వై.శ్రీమన్నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ పాల్గొన్నట్లు వర్మ తెలిపారు.

సేవల్లో ముందున్న కెనరా బ్యాంక్



సైకిల్ షెడ్‌ను ప్రారంభించిన కెనరా బ్యాంక్ ఏజీఎం తోట రవిచంద్ర

ఆకివీడు: వ్యాపారంలోనూ, సేవల్లోనూ కెనరా బ్యాంక్ దేశంలోనే తనదైన శైలిలో ముందుకు వెళ్లుతోందని ఆ బ్యాంక్ ఉమ్మడి జిల్లా ఏజీఎం తోట రవి చంద్ర చెప్పారు. మండలంలోని కుప్పనపూడి, కాళింగ గూడెం గ్రామాల్లో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన సైకిల్ షెడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ, బ్యాంకుకు వచ్చిన సీఎస్ఆర్ నిధులను సేవా కార్యాక్రమాలకు అందజేస్తున్నామని చెప్పారు. ఆయా కార్యక్రమంలో సర్పంచ్‌లు ముత్యాల అనురాధ, గురువెల్లి అన్నపూర్ణ, స్థానిక బ్యాంక్ మేనేజర్ సందీప్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, రఘు ప్రసాద్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులను చేర్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల చేరికపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖల అధికారుల పరిధిలోని వసతి గృహాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి హాస్టల్ నందు నిబంధనల ప్రకారం ఒక వంద మంది వసతి పొందాల్సి ఉండగా చాలా తక్కువ మంది వసతి పొందడం, కొన్ని వసతి గృహాల్లో అసలు చేరికలు ఎందుకు ఉండడం లేదని అధికారులను ఆరా తీశారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులందరూ వసతి గృహాల్లో చేరికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మత్స్యకార గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం, వసతి గృహాల్లో ఖాళీల సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతి రావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, డి.పుష్ప రాణి, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ ప్రధాన్ పాల్గొన్నారు.

త్వరలో కుష్టు వ్యాధి కాలనీ ఆసుపత్రి ప్రారంభం



పండ్లు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ దాసి రాజు

భీమవరం (ప్రకాశం చౌక్): కుష్టు వ్యాధి గ్రస్తులను ఆదరించినప్పుడే మహాత్మాగాంధీకి నిజమైన నివాళిలని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, సెయింట్ మేరీస్ లెప్రసి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలో భాగంగా గునుపూడిలోని కుష్టు వ్యాధి కాలనీలో ఉచిత వైద్య పరీక్షలు, మందులు, పండ్లు పంపిణీ చేశారు. దాసి రాజు మాట్లాడుతూ 4 దశాబ్దాలుగా భీమవరం లెప్రసి కాలనీలో సెయింట్ మేరీస్ లేప్రసి సెంటర్ విశేష సేవలు అందిస్తున్నారని, వీరికి పద్మభూషణ్ బీవీ రాజు, సంఘ సేవకులు రంగసాయిల ద్వారా ఈ కాలనీలో ఎన్నో సమకూర్చడం అభినందనీయమని అన్నారు. కేంద్ర రాష్ట్ర వైద్య శాఖలు అనేక సంక్షేమ పథకాలు కుష్టు వ్యాధి గ్రస్తులకు ఏర్పాటు చేశారని, త్వరలో ఈ ప్రాంతంలో వైద్య సదుపాయం కోసం ప్రభుత్వం నిర్మించిన వైద్యశాలలో సేవలు ప్రారంభమవుతాయని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆకివీడు ఎంవీఎస్ రాజు సహకారంతో పండ్లు, రొట్టెలు అందించామని, 74 మందికి సెయింట్ మేరీస్ లెప్రసి సెంటర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిస్టర్ ఎల్విరా, ఏవో ఆకుల పెద్ది రాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, దళిత ఐక్య వేదిక అధ్యక్షులు గంటా సుందర కుమార్ పాల్గొన్నారు.

వంతుల వారీ నీటిని వినియోగించుకోవాలి



నంద్యాల సీతా రామయ్య

ఆకివీడు: వంతుల వారీ విధానంతో సాగునీటి సరఫరా జరుగుతున్నందున రైతులు నీటిని సద్వినియోగం చేసుకుని రబీ సాగు పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోదావరిలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుని, సీలేరు నుంచి అదనపు నీటి కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని చెప్పారు. చిలకంపాడు లాకుల వద్ద నుండి వెంకయ్య వయ్యేరు పంట కాల్వకు వంతుల వారీగా ఈ నెల 3వ తేదీ సాయంత్రం 3 గంటలకు వంతు ప్రారంభమైందని చెప్పారు. 9 సాయంత్రం 6 గంటల వరకూ ఉంటుందన్నారు. రెండవ వంతు 16న ప్రారంభమై 22 వరకూ, మూడవ వంతు మార్చి 1న ప్రారంభమై 7 వరకూ, నాల్గొవ వంత 14న ప్రారంభమై 20 వరకూ, ఐదవ వంతు మార్చి 27న ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తుందని సీతారామయ్య వివరించారు. మండలంలోని 16 గ్రామాల్లోనూ 10,447 ఎకరాలకు, కాళ్ల మండలంలోని దొడ్డనపూడి, ఏలూరుపాడు, కాళ్లకూరు, జువ్వలపాలెం గ్రామాలలో 3,174 ఎకరాలకు వెంకయ్య వయ్యేరు పంట కాల్వ ద్వారా సాగు నీటిని వంతుల వారీగా సరఫరా చేస్తారని ఆయన తెలిపారు.

ధాన్యలక్ష్మి అలంకరణలో మావుళ్లమ్మ



ధాన్యలక్ష్మి భక్తులకు దర్శనమిస్తున్న మావుళ్లమ్మ

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీరామ మురళీ కోలాటం బొమ్మినంపాడు వారితో కోలాట ప్రదర్శన, 3 గంటలకు శివశంకరి భజన సమాజం రాజమండ్రి వారితో భజన, సాయంత్రం 4 గంటలకు జై శ్రీ దుర్గా మల్లేశ్వరి జ్యోతిషాలయం పాలా దుర్గా ప్రసాద్ సిద్ధాంతి పెన్నాడ వారితో దేవి భగవత ప్రవచనం, సాయంత్రం 5 గంటలకు షిర్డిసాయి బుర్రకథ దళం కాకినాడ వారితో వైరేటీ బుర్రకథ, రాత్రి 8 గంటలకు స్వాతి ఆర్కెస్ట్రా వారి సినీ సంగీత విభావరి అలరించాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ధాన్యలక్ష్మి అలంకరణలో అలంకరించారు.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్స ఉత్సవాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు అన్నమాచార్య కీర్తనలు, 4 గంటలకు భగవద్గీత ప్రవచనములు, సాయంత్రం 5 గంటలకు కూచిపూడి జానపద నృత్యాలు, 8 గంటలకు సినీ సంగీత విభావరి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.